జనపదం
JANAPADHAM

హైదరాబాద్ | సోమవారం 11 నవంబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 153 | తెలుగు దినపత్రిక

నేడే సీజేఐ ప్రమాణం..

- బాధ్యతలు స్వీకరించనున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా
- అత్యున్నత న్యాయస్థానానికి 51వ ప్రధాన న్యాయమూర్తిగా విధుల్లోకి..
- ఆదివారం జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీ విరమణ..

4

మా ముచ్చట్లు మీకెందుకు..?

ధరణి వివరాలు ఎందుకు చెప్పాలి
సర్వే అవసరం లేదు.. వెళ్లండి..
మేం చాలా రిచ్.. మీ లెక్క మాకవసరం లేదు
కులగణనపై ప్రజల్లో వ్యతిరేకత...
గ్రామాల్లో బహిష్కరణలు
ఎన్యూమరేటర్లకు తప్పని తిప్పలు..

4

తప్పదు మరి..?!
వేలం.. వెర్రి..?!

గ్యారంటీల తొర్రి..

- పోటాపోటీ జాతీయ పార్టీల హామీల వర్షం..
- తిట్టిన నోటనే తప్పని ముచ్చట్లు...
- ఇప్పటికే గ్యారంటీలతో ప్రజల్లోకి వెళ్లిన కాంగ్రెస్..
- తాజాగా బీజేపీది అదే మంత్రం..
- మహారాష్ట్రలో 10 గ్యారంటీలతో మేనిఫెస్టో ప్రకటించిన కమలం నేతలు..

జనపదం, బ్యూరో

గ్యారంటీ గారడీ చేస్తున్నది అనేకంటే చేయిస్తున్నది. నేను లేకుండా మీ పప్పులు ఉడకవు గాక ఉడకవు అన్నట్టుగా పంతం నెగ్గించుకుంటున్నది. ఒడ్డెక్కాలన్నా.., ఓట్లు పడాలన్నా., నేను లేకపోతే మీకు దిక్కే లేదన్నట్టుగా తయారైంది. ఆ మాటకొస్తే పార్టీ ఏదైనా సరే గ్యారంటీగా గ్యారంటీని ఆశ్రయించాల్సిందే., లేదంటే దిక్కులే నిదై పోవాల్సిందే అనే స్థాయికి గ్యారంటీ రెచ్చిపోయింది. కాంగ్రెస్ ను గ్యారంటీ పేరు చెప్పి తిట్టిపోసిన కమలం నేతలు ఇప్పుడు తప్పని సరై అన్నట్టుగా గ్యారంటీలను మేనిఫెస్టో లో చేర్చారంటే దాని పవర్ ఏంటో తెలిసిపోతున్నది.

అప్పుడు రాద్ధాంతం.. ఇప్పుడు రాజమార్గం...

మల్లికార్జున ఖర్గే మాటలను విపరీతంగా వాడుకున్న బీజేపీ ఇప్పుడు అడిగే వారికి ఏం సమాధానం చెబుతారో తెలియదు. మొన్నటికి మొన్న కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే పార్టీ ముఖ్యులతో ఆచరణ సాధ్యం కాని వాటి జోలికి వెళ్లొద్దని, ప్రజలకు అంతోఇంతో చేసే స్కోప్ ఉన్న వాటినే ప్రచారంలో ప్రధానంగా వాడాలని చేసిన వ్యాఖ్యలను బీజేపీ విపరీతంగా ట్రోల్ చేసింది. గ్యారంటీ లేని పార్టీ కాంగ్రెస్ అని, గ్యారంటీపైనే ఆధారపడడం తప్ప మరేమి తెలియని నైజం తనదని తాము అలా కాదని ఎన్నో రకాలుగా చేసిన బీజేపీ నాయకులు ఇప్పుడు మహారాష్ట్రలో అచ్చంగా కాంగ్రెస్ బాటలోనే నడక సాగించేందుకు నిర్ణయించడం ముక్కున వేలేసుకోవాల్సిన పరిణామమే.

ఒక్కోటి పెంచుతున్న హస్తం..

కాంగ్రెస్ పార్టీ 2023 .....(తరువాయి 4లో)

ఉల్లిగడ్డ ఊరందరికీ వద్దన్న గానీ, ఇంట్లో వద్దన్నానా.. అన్నట్టుంది బీజేపీ పరిస్థితి. గ్యారంటీలు, ఉచితాలు వద్దే వద్దు అని మొన్నటి వరకు బడాయిపోయిన కమలం నేతలు ఇప్పుడు తప్పని సరై అన్నట్టుగా ఆ పంథానే ఎంచుకున్నారు. కాంగ్రెస్ ను దుమ్మెత్తిపోసిన పెద్దలు, తాజాగా ఆ మార్గంలోనే నడక సాగిస్తామనే సంకేతాలు ఇచ్చారు. హస్తం పార్టీ గ్యారంటీలపై విరుచుకుపడిన బీజేపీ నాయకులు ఇప్పుడు అవే గ్యారంటీలతో మేనిఫెస్టోలను విడుదల చేస్తూ ప్రజలను ముగ్గులోకి దింపడానికి తంటాలు పడుతున్నారు. ఎలాగైనా సరే పీఠం దక్కించుకోవాలనే ఒకేఒక ముందుచూపుతో ఎడాపెడా హామీలు గుప్పిస్తూ తాము ఆ తాను ముక్కలమే అని స్పష్టంగా నిరూపించుకుంటున్నారు. మహారాష్ట్ర ఎన్నికల మేనిఫెస్టోలో పది గ్యారంటీలతో విడుదల చేసిన కాగితాలు అందుకు నిదర్శనం.

అటు బాంబులు.. ఇటు కాల్పులు..

- ఉలిక్కిపడ్డ హైదరాబాద్..
- జూబ్లీహిల్స్ లో భారీ పేలుడు..
- సమీప ఇండ్లపై ఎగిరిపడిన రెస్టారెంట్ గోడ రాళ్లు
- నాలుగు గుడిసెలు ధ్వంసం, ఓ మహిళకు గాయాలు
- సరూర్ నగర్ లో కాల్పుల కలకలం..

2

ప్రాజెక్టులు పూర్తి చేయకుంటే చరిత్ర క్షమించదు..

నాపై కోపం ఉంటే కక్ష సాధించుకోండి ప్రాజెక్టులను మాత్రం అడ్డుకోకండి..

ఉమ్మడి పాలమూరులో పెండింగ్ ప్రాజెక్ట్ లు పూర్తి చేస్తాం

ప్రతి గ్రామానికి, ప్రతి తండా కు బీటీ రోడ్లు
కురుమూర్తి ఆలయానికి రూ.వంద కోట్లు
అభివృద్ధి ప్రణాళికల కోసం ఆదేశాలిస్తున్నా..
కురుమూర్తి బ్రహ్మోత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి

జనపదం, మహబూబ్ నగర్ బ్యూరో:

పాలమూరు బిడ్డకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వచ్చిందంటూ కురుమూర్తి స్వామి దయేనని, కురుమూర్తి స్వామి దయతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని సీఎం రేవంత్రెడ్డి అన్నారు. తాను ఈ జిల్లా బిడ్డగా.. ఇక్కడి ప్రజలకు ఉపయోగపడే సాగునీటి ప్రాజెక్టుల్ని పూర్తి చేయకపోతే చరిత్ర క్షమించదని వ్యాఖ్యానించారు. తమ ప్రయత్నాన్ని అడ్డుకోవాలని కొందరు ఆరోపణలు చేస్తున్నారని, చిల్లర రాజకీయాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సీఎం ఆగ్రహించారు. తనపై కోపం ఉంటే రాజకీయంగా తనపై కక్ష సాధించాలని, అంతే తప్ప ప్రాజెక్టులను అడ్డుకోవద్దని అభ్యర్థించారు. తరతరాల వెనుకబాటును సరిదిద్దేందుకు చేస్తున్న ప్రయత్నాలకు.. అడ్డుకుని జిల్లా అభివృద్ధిని కుంటుపరచవద్దని కోరారు. అలా కాదని.. రాజకీయం లేదని ప్రాజెక్టులకు అడ్డంకులు సృష్టిస్తే పాలమూరు జిల్లా ప్రజలు క్షమించరని, అలాంటి వాళ్లంతా చరిత్ర హీనులుగా మిగిలిపోక తప్పదు హెచ్చరించారు. పాలమూరు జిల్లాలోని చిన్న చింతకుంట మండలం అమ్మాపురంలోని శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం హాజరయ్యారు. .....(తరువాయి 2లో)

పొంగులేటికి బాంబుల శాఖ..

రేవంత్‌వి అబద్ధాలు, హౌలా మాటలు

- ఏం చేశారని విజయోత్సవాలు
- వైఫల్య వారోత్సవాలు నిర్వహిస్తాం..
- మాజీ మంత్రి కేటీఆర్

జనపదం, హన్మకొండ: ఏం చేశారని కాంగ్రెస్ పార్టీ విజయోత్సవాలు చేస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తాము కూడా కాంగ్రెస్ పరిపాలన వైఫల్య వారోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. ఆదివారం హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి బాంబుల శాఖ ఇవ్వాలని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర వెళ్లి అబద్ధాలు, హౌలా మాటలు మాట్లాడుతున్నారని కేటీఆర్ అన్నారు. ఎవని అయ్యా సొమ్ము అని అబద్ధాలతో ఫుల్ పేజీ యాడ్లు వేస్తున్నాడని విమర్శించారు. సరిగ్గా సంవత్సరం కింద ఇదే రోజు కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ బీసీలకు అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటంటే ఒక్క బీసీ డిక్లరేషన్ హామీ అయినా అమలు చేసిందా అని నిలదీశారు. కొత్త పథకాల విషయం దేవుడెరుగు.. ఉన్న వాటిని కూడా కాంగ్రెస్ ఎత్తేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెనకబడిన వర్గాలకు వెన్నుపోటు పొడిచిందని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేతి వృత్తులకు చేయూతనిస్తూ బలహీన వర్గాలకు విద్య, వృత్తి లాంటి అన్ని అవకాశాల్లో ఆసరాగా నిలిచిందని అన్నారు. కులగణన పూర్తయిన తర్వాతనే, 42% రిజర్వేషన్ ఇచ్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రధాన ప్రతిపక్షంగా బహుజన వర్గాల తరపున ప్రభుత్వం ముందు ఉంచుతున్నామని అన్నారు. రేవంత్ రెడ్డి బీసీల కోసం ఇచ్చిన హామీలపైన, ఇచ్చిన ఆరు గ్యారెంటీ అమలు పైన ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన డిక్లరేషన్లన్నింటిపైనా ప్రశ్నిస్తూనే ఉంటామని తెలిపారు. డిక్లరేషన్లన్నీ పాములై రేవంత్ మెడలో పడతాయని పేర్కొన్నారు. మేము చేసిన పనులు మీరు చేసినట్టు చెప్పుకుంటే ప్రజలు కాంగ్రెస్ నాయకుల బట్టలు ఊడదీసి కొడతారని అన్నారు.

జై బీసీ..

- అన్ని పార్టీలదీ అదే వాదం..
- తప్పనిసరై అనుసరిస్తున్న ప్రధాన నేతలు..
- ఎవరి నోట విన్నా అదే మాట..
- బలం పుంచుకుంటున్న వెనకబాటు తనం..

జనపదం, బ్యూరో:

పార్టీలన్నీ కదులుతున్నాయి. నేతలంతా మాటలు కలుపుతున్నారు. తప్పని సరే కావొచ్చు., ఇక తప్పదు చేయాల్సిందే అనే నిర్ణయానికి వచ్చైనా ఉండొచ్చుగానీ బీసీవాదం బలం పుంజుకుంటున్నది. అగ్రవర్ణాల చేతిలో కీలుబొమ్మగా మారిన అధికార పీఠాన్ని విడిపించడానికి వెనకబడిన వ్యవస్థలన్నీ ఒక్కటవుతున్న తీరుకు అంతా కలిసి రావాల్సిన అఘాయిత్యం ఏర్పడింది. దీంతో ఏ పెద్ద నాయకుడిని చూసినా, ఎవరిని పలకరించినా తమ అసలు రూపాన్ని అంతర్గతంగా కప్పిపెట్టుకుని బయటకు బీసీ వాదాన్ని ఎత్తుకుని శభాష్ అనిపించుకుంటున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నది.

బండి మాటల వెనక అర్థమదే..

తాజాగా కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కూడా హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లిలో ఆదివారం గతంలో పిడుగుపాటుకు ధ్వంసమైన ఇల్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో జరిగే కులగణనకు బీజేపీ వ్యతిరేకం కాదని, కానీ జరుగుతున్న తీరు మాత్రం కాస్త ఇబ్బందికరంగా ఉందన్నట్టుగా అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలకు చిత్తశుద్ధి లేదని, ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్ పార్టీని ప్రజలు వ్యతిరేకిస్తున్నాదని పేర్కొన్నారు.

వ్యతిరేకం కాదంటున్న బీఆర్ఎస్..

బీసీల ఓట్ల కోసం కాంగ్రెస్ శతవిధాల యత్నం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కులగణన పేరుతో జనానికి గాలం వేయాలని చూస్తోందని, అందుకే 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం బీసీల ఓట్ల కోసం అధికారులను బలి పశువులను చేస్తున్నారని, ఆ మాటకొస్తే బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన కొత్త పథకాల ముచ్చట దేవుడెరుగు, కనీసం బీఆర్ఎస్ సర్కార్ ప్రవేశపెట్టిన పథకాలనైనా సక్రమంగా చేస్తున్నారా.. అంటే అదీ లేదన్నారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక బీసీ బంద్ బందు చేశారని, రైతుబంధు అటకెక్కించారన్నారు. బీసీలకు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయి అని ఆయన నిలదీశారు.

కులగణనతో కాంగ్రెస్ క్లియర్..

తప్పనిసరై అన్నట్టుగా రాష్ట్ర ప్రభుత్వం బీసీ వాదాన్ని ఎత్తుకుని నడక సాగిస్తున్నది. అధికారంలో ఉన్నది కాబట్టి పెరుగుతున్న ఒత్తిడి కోసమైనా బీసీ కులగణన చేయిస్తూ తన పనిని ప్రజలకు తెలియజెప్పుతున్నది. స్థానిక ఎన్నికల వరకు ప్రక్రియ పూర్తిచేయాలనే ప్రణాళికతో ముందుకెళ్తున్నా, మున్ముందు పరిస్థితులు ఎలా ఉంటాయో ఏమోగానీ ఇప్పుడైతే కాంగ్రెస్ కూడా అదే తోవలో వెళ్తున్నది. ఇలా అన్నీ పార్టీలు బీసీలే దిక్కు., వారి అభ్యున్నతే మహాప్రసాదం అన్నట్టుగా కలరింగ్ ఇస్తున్న ప్రస్తుతం సందర్భం నిజంగా బీసీ వాదానికి అదనపు బలమే.

అబద్ధం @ రేవంత్..

అన్నీ బోగస్ ముచ్చట్లే..

- తిట్ల దండకం తప్ప పొడుస్తున్నదేం లేదు..
- అడిగితే మీర పడి అరుచుడే..
- ముఖ్యమంత్రి కాదు., కార్యకర్తలెక్క చేస్తాండు..
- తెలంగాణ డబ్బు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నాడు...
- ఆరబోసిన వడ్లే ఆయన అసమర్థతను చూపుతున్నాయి..
- విద్యార్థుల వీపు పగులగొట్టిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది...
- మాజీ మంత్రి హరీష్ రావు.
- తెలంగాణ భవన్ లో మీడియాతో సమావేశం..

జనపదం, హైదరాబాద్ బ్యూరో:

''అబద్ధానికి ప్యాంటు, చొక్కా వేస్తే అచ్చం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిరిగానే ఉంటుంది. నిలువెత్తు అబద్ధపు సాక్ష్యం ఆయన. మాట్లాడే ప్రతి మాటలో స్పష్టంగా పూటదాటుడు విధానమే కనిపిస్తుంది తప్ప, పనులు చేసే తెగింపైతే మచ్చుకైనా కానరావడం లేదు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వ్యవహరించాల్సిన వ్యక్తి., వీధి రౌడీగా, రోడ్డుమీద వదిలిన పోకిరిగా వ్యవహరిస్తున్నారు. ఆ సీటుకున్న అందమే పోతున్నది., ప్రజలు ఈయననా మనం గెలిపించుకున్నది అనే అవమానంగా ఫీల్ అయ్యే పరిస్థితులను కల్పిస్తున్న తీరు ఆయనది..'' అని మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజమెత్తారు. ఆదివారం తెలంగాణ .....(తరువాయి 2లో)

మజ్లిసే అడ్డంకి..

- పాతబస్తీలో అభివృద్ధిని అడ్డుకుంటున్నది ఆ పార్టీ లీడర్లే..
- పక్షపాతంతో వ్యవరిస్తున్న ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఫైర్

జనపదం, హైదరాబాద్ సిటీ

పాతబస్తీలో అభివృద్ధిని మజ్లిస్ పార్టీ లీడర్లు అడ్డుకుంటున్నారని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. దశాబ్దాల తరబడి పాతబస్తీలోని అనేక ప్రాంతాలకు మజ్లిస్ పార్టీ లీడర్లు ఎమ్మెల్యేలుగా, కార్పొరేటర్లుగా పనిచేస్తున్నారని, అయినా అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందడం లేదన్నారు. మజ్లిసేతర ప్రాంతాల్లో ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం కూడా ప్రజలకు అందకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మజ్లిస్ కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు పక్షపాతంతో వ్యవహరిస్తూ పాతబస్తీలలోని కొన్ని ప్రాంతాల ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ఆదివారం నాంపల్లి నియోజకవర్గంలోని ఆసిఫ్ నగర్ డివిజన్ దయాబాగ్ లో కమ్యూనిటీ హాల్ ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యుడిగా, కేంద్రమంత్రిగా నాంపల్లి నియోజకవర్గం ప్రజలకు మేలు చేసే విధంగా అనేక పనులు చేపట్టానని చెప్పారు. మజ్లిస్ .....(తరువాయి 4లో)



కార్లను తరలిస్తున్న కంటైనర్ లో మంటలు

ఎనిమిది కార్లు అగ్నికి ఆహుతి

జనపదం, క్రైం: సంగారెడ్డి జిల్లా జహిరాబాద్‌లోని హైవేపై భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కార్లు తరలిస్తున్న కంటైనర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఎనిమిది కార్లు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది మంటలు ఆర్పుతున్నారు. ముంబై నుంచి హైదరాబాద్ వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో ముంబై-హైదరబాద్‌పై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేసే ప్రయత్నం చేశారు.

జాబ్ క్యాలెండర్ అమలుకు కృషి

- నిజామాబాద్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ నరేందర్ రెడ్డి పర్యటన
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని కలిసిన వీఎన్ఆర్

జనపదం, నిజామాబాద్: ఎన్నికల సమయంలో నిరుద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పెట్టిన జాబ్ క్యాలెండర్ అమలుకు కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్పోర్స్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ పట్టణంలో పలు పాఠశాలలను, గ్రంథాలయాలను సందర్శించి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతను కలిసి రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు తెలుపాలని కోరారు. ఈ సందర్భంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, షబ్బీర్ అలీని మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారి మద్దతు కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే నిరుద్యోగ యువతకు అండగా ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఉమ్మడి నాలుగు జిల్లాల వ్యాప్తంగా నిరుద్యోగులకు స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేస్తానని అన్నారు.

అటు బాంబులు.. ఇటు కాల్పులు..

- ఉలిక్కిపడ్డ హైదరాబాద్..
- జూబ్లీహిల్స్‌లో భారీ పేలుడు..
- సమీప ఇండ్లపై ఎగిరిపడిన రెస్టారెంట్ గోడ రాళ్లు
- నాలుగు గుడిసెలు ధ్వంసం, ఓ మహిళకు గాయాలు
- సరూర్ నగర్ లో కాల్పుల కలకలం..

జనపదం, హైదరాబాద్ సిటీ: హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 1 చెక్ పోస్టు సమీపంలో భారీ పేలుడు సంభవించింది. ఆదివారం తెల్లవారు జామున చెక్ పోస్టు సమీపంలోని తెలంగాణ స్పెసీ కిచెన్ రెస్టారెంట్ లో ఈ పేలుడు సంభవించింది. రెస్టారెంట్ లోని రిఫ్రిజరేటర్ కంప్రెసర్ ఒక్కసారిగా పేలడంతో భారీ శబ్దంతో వచ్చింది. పేలుడు ధాటికి రెస్టారెంట్ ప్రహరీ గోడ ధ్వంసమైంది. సమీపంలోని దుర్గాభావానీ నగర్ బస్తీలో ఉన్న ఇండ్ల మీదకు రాళ్ళు ఎగిరిపడ్డాయి. ఈ ఘటనలో నాలుగు గుడిసెలు ధ్వంసం కాగా, పలు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఓ మహిళకు గాయలయ్యాయి. ఎటువంటి ప్రాణహానీ జరగకపోవడంతో దుర్గానగర్ బస్తీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు. పేలుడు సమాచారాన్ని అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. డీసీపీ విజయ కుమార్, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి కలిసి రెస్టారెంట్ నిర్వహకులతో మాట్లాడి వివరాలి అడిగి తెలుసుకున్నారు. ఈ వ్యవహారంలో రెస్టారెంట్ మేనేజర్ ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరోపక్క ఘటనాస్థలాన్ని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలను తెలుసుకున్నారు.

సరూర్ నగర్ లో కాల్పులు

సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెంకటేశ్వరా కాలనీ రోడ్డు నెంబర్ 14 లో మల్లికా రాణి అపార్ట్ మెంట్ లో ఎయిర్ గన్ తో అమ్మాయి తండ్రి రేవంత్ ఆనంద్ పై కాల్పులు జరిపిన ప్రియుడు కంటిలో నుండి వెళ్లిన రౌండ్. వివరాల్లోకి వెళ్తే.. అంబర్ పేట్ కు చెందిన బల్విందర్ సింగ్ మన్వీత ఇద్దరు కొంత కాలంగా ప్రేమించుకున్నారు. ఇంట్లో తెలిసి అమ్మాయి తండ్రి అమ్మాయిని ఈ మధ్యనే ఎవ్వరికి తెలియకుండా అమెరికా కు పంపించాడు. విషయం తెలుసుకున్న బల్విందర్ సింగ్ అమ్మాయి తండ్రి రేవంత్ ఆనంద్ ఇంటికి వచ్చి వాగ్వాదం దిగడంతో ఎయిర్ గన్ తో ఒక రౌండ్ కాల్పులు జరుపడంతో బల్వీందర్ సింగ్ కంటిలో నుండి బుల్లెట్ దూసుకెళ్లింది. కాగా, విషయం తెలియడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని బాధితుడిని ఆస్పత్రికి తరలించి, నిందితుడు బల్వీందర్ సింగ్ ను అదుపులోకి తీసుకున్నారు.

ఏం పొడిచారని ఉత్సవాలు..

- రాష్ట్రమంతా గోసపడుతుంటే సంబురాలా..?
- నెలరోజులుగా రైతులు రోడ్లపైనే ఉంటున్నారు..
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

జనపదం, కరీంనగర్ : కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోంది.., ఇప్పటి వరకు ప్రజలకు చేసిందేమీ లేదు, సాధించింది అంతకన్నా లేదు., కానీ ఏదో పొడిచినట్టుగా కాంగ్రెస్ విజయోత్సవాలు జరుపుకోవడానికి ప్రణాళికలు మాత్రం రచించిందంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన కరీంనగర్ జిల్లా శంకర పట్నం మండలంలోని కొత్తగట్టులో వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ రైతుల ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. నెలరోజులుగా వడ్లు తెచ్చినా ఎవరూ కొనడం లేదని సంజయ్ కి అన్నదాతలు తమ కష్టాలను ఏకరువు పెట్టుకున్నారు. వారి ఇబ్బందులను స్వయంగా చూసిన తర్వాత ఆయన మాట్లాడుతూ 'బోనస్' తప్పించుకోవడానికే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నదని, వారి కమీషన్ల కోసం రైతులను బలి పెడుతున్నారని దుయ్యబట్టారు. మిత్తీతో సహా వడ్ల పైసలన్నీ కేంద్రమే ఇస్తోందని, ఆఖరికి సుతిలి తాడు సహా రవాణా ఖర్చులన్నీ భరిస్తోందని అలాంటప్పుడు వడ్లు కొనడానికి రాష్ట్ర సర్కార్ కు వచ్చిన నొప్పేంటో అర్థం కావడం లేదన్నారు. అన్నదాతల కష్టాలు తీర్చడానికి ఎప్పుడూ ముందుంటామని, వారి కోసం బీజేపీ తరపున కృషి చేస్తామన్నారు.

వంచన విజయోత్సవం..

తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ అధికారం చేపట్టి పది నెలలు పూర్తి చేసుకుని సంవత్సరం దిశగా వెళ్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఉత్సవాలు జరుపుకోవడానికి నిర్ణయించడంపై బండి తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం ఏం చేసిందో చెప్పాలన్నారు. ఏదో సాధించినట్టు ఉత్సవాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని, ప్రజా వంచన ఉత్సవాలు చేసుకుంటే వారి పనితీరుకు సరిగ్గా సరిపోతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలయాలను కూల్చడానికి ప్రత్యేక దళాలను దింపినట్టుగా వాతావరణం ఉందని, గుడులపై వరుస దాడులు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకుంటలేదో ప్రజలంతా గమనిస్తున్నారని బండి సంజయ్ పేర్కొన్నారు.

ఫోన్ స్విచ్ఛాఫ్.. ఇంటికి తాళం

పరారీలో తమిళ నటి కస్తూరి..!

జనపదం, బ్యూరో: తెలుగు వారిని కించపరిచే వ్యాఖ్యలు చేసిన తమిళ నటి కస్తూరి పరారీలో ఉన్నారు. ఆమె ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేసి ఉంది. ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో ఈ కేసులో కస్తూరికి సమన్లు ఇవ్వడం పోలీసులకు కష్టంగా మారింది. కొద్ది రోజుల క్రితం నటి కస్తూరి తెలుగువారిపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఓ రాజకీయ సభలో ఆమె తెలుగు వారిని కించపరుస్తూ మాట్లాడారు. ఆమె వ్యాఖ్యలపై తెలుగు సంఘాలు మండిపడ్డాయి. దీంతో ఆమె తన తప్పును సరిదిద్దుకునే ప్రయత్నం చేశారు. తాను తెలుగు వారిని కించపరిచే ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదని ప్రకటించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. మూడు రోజుల క్రితం కస్తూరిపై చెన్నైలో ఇదే విషయమై కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు ఆమెకు సమన్లు అందజేసేందుకు పోలీసులు ఇంటికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో ఫోన్ చేశారు. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వచ్చింది. దాంతో నటి కస్తూరి పారిపోయారనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఆమె ఎక్కడుందనే విషయంలో స్పష్టమైన సమాచారం లేదు. అన్నమయ్య సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కస్తూరి ఆ తర్వాత పలు సినిమాల్లో నటించారు. ఓ తెలుగు సీరియల్‌లోనూ లీడ్ రోల్ పోషించి మంచి గుర్తింపు పొందారు. అందుకే తెలుగులో అవకాశాలు పొందుతూ తెలుగు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడమేంటని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కుటుంబ పోషణ ఎలా..?

30 ఏళ్ల అనుభవానికి రూ.1500 వేతనమా..

సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం ఫైర్

జనపదం, భువనగిరి : ముప్పేళ్లుగా ప్రభుత్వ కార్యాలయంలో పని చేస్తున్న స్వీపర్లకు నెలకు 1500 రూపాయలు వేతనం చెల్లించడం ఎంతవరకు సమంజసమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం (సుందరయ్య భవన్లో) ప్రభుత్వ ఎంపీడీవో, తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న స్వీపర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం యూనియన్ అధ్యక్షురాలు కౌసల్య అధ్యక్షతన జరగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడు తూ స్వీపర్లకు ఇచ్చేది తక్కువ వేతనం అయినా ఆరు మాసాలుగా వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం స్వీపర్లను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. వెంటనే పెండింగ్లో ఉన్న స్వీపర్ల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. వారసత్వంగా తల్లిదండ్రులు చేసిన పనిని వారి పిల్లలు ఎంచుకొని గత 30 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న వారికి కనీస వేతనం ప్రభుత్వం చెల్లించకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. పెరిగిన ధరలకు అనుకూలంగా వారి అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కనీస వేతనాన్ని 18 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 18 వేల రూపాయలతో పాటు పెండింగ్లో ఉన్న వేతనాలను చెల్లించే వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కార్యదర్శి శంకరమ్మ, నాయకులు లక్ష్మి చంద్రకళ, పారిజాత, మాధవి, వసంత, బాలమని, నరసమ్మ పాల్గొన్నారు.

ప్రాజెక్టులు పూర్తి చేయకుంటే చరిత్ర క్షమించదు..

(మొదటిపేజీ తరువాయి) సీఎం రేవంత్ రెడ్డికి ఆలయ పూజారులు, అధికారులు, జిల్లా యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన సీఎం ఆలయంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు.

కురుమూర్తి స్వామి దర్శనం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం రేవంత్రెడ్డి మాట్లాడుతూ కురుమూర్తి స్వామి ఆలయం పేదల తిరుపతిగా ప్రసిద్ధి పొందిందని కొనియాడారు. తెలంగాణ నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా భక్తులు ఇక్కడకు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారని గుర్తు చేశారు. ఎంతో ముఖ్యమైన ఈ ఆలయంలో భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రూ.110 కోట్లతో ఘాట్ రోడ్, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, ఇంత ముఖ్యమైన ఆలయాన్ని అభివృద్ధి పనులకు అంచనాలు పంపించాలని అధికారుల్ని ఆదేశించారు.కురుమూర్తిస్వామి ఆలయంలో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయానికి ఏం కావాలో కలెక్టర్ నివేదిక ఇస్తే నిధులు విడుదల చేస్తామని సీఎం ప్రకటించారు. జిల్లాలోని ప్రధాన దేవాలయాలు మన్యంకొండ, కురుమూర్తి దేవస్థానం అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు దేవాదాయ శాఖ వారితో చర్చించి నివేదికలు ఇవ్వాలని, ఈ రెండు దేవాలయాలను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రాజెక్టులు ఎందుకు పూర్తి కాలేదు..?

సరైన నీటి వనరులు లేక, పంటలు పండక.. ఏటా వేల మంది పాలమూరు నుంచి వివిధ ప్రాంతాలకు వలస వెళుతుంటారని, దేశంలో ఏ నీటిపారదుల ప్రాజెక్టుల నిర్మాణంలోనైనా పాలమూరు ప్రజల కృషి ఉందని, అలాంటి పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కాకపోవడానికి గత పాలకుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. నీళ్లు కోసం, నిధుల కోసమే తెలంగాణ అని చెప్పిన నాయకులు పదేళ్ల పరిపాలనలోనూ వలసలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై జిల్లాను అభివృద్ధి చేసేందుకు పట్టుదలతో పనిచేస్తామని, ఇక్కడి ప్రాజెక్టుల్ని పూర్తి చేసి పాడిపంటలతో విలసిల్లేట్లు చేసే విధంగా ప్రభుత్వ నిర్ణయాలుంటాయని సీఎం రేవంత్రెడ్డి ప్రకటించారు. నారాయణ్ పేట్ – కొడంగల్ ప్రాజెక్టు పూర్తి చేసి త్వరలోనే మక్తల్, నాగర్ కర్నూల్, కొడంగల్ ప్రాంతాలకు కృష్ణా జలాలు పారిస్తామని తెలిపారు. పాలమూరు అభివృద్ధిని అడ్డుకోవాలని కొంతమంది ఇంకా ప్రయత్నాలు చేస్తున్నారని, ఇక్కడి బిడ్డనై ఉండి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయకుంటే ప్రజలు క్షమించరన్నారు. పాలమూరు ప్రజలు ఓట్లేస్తేనే కేసీఆర్ రెండుసార్లు సీఎం అయ్యారని, 12 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ఒక సీఎంను ఈ ప్రాంతం అందించిందన్నారు. తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు మహబూబ్ నగర్ నుండి ప్రాతినిధ్యం వహించగా ఇన్ని సంవత్సరాల తర్వాత పాలమూరు బిడ్డ అయిన తనకు ముఖ్యమంత్రిగా పని చేసే అవకాశం వచ్చిందని, అందువల్ల ఎవరు అడ్డుపడిన ఉమ్మడి పాలమూరు జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి తీరుతానని హామీ ఇచ్చారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక 10 సంవత్సరాలు ముఖ్యమంత్రి గా ఉండి పాలమూరు అభివృద్ధికి ఏమి చేయలేకపోయారని గుర్తుచేశారు. అప్పుడు వారి సొంత జిల్లాను అభివృద్ధి చేసుకుంటే తాము ఎలాంటి అభ్యంతరం చెప్పలేదని, ఇప్పుడు తనకు ముఖ్యమంత్రిగా అవకాశం వచ్చి స్వంత జిల్లాను అభివృద్ధి చేసుకునే ప్రయత్నం చేస్తే లేనిపోని ఆరోపణలు చేసి అడ్డుపడుతున్నారని ప్రతిపక్ష పార్టీలపై మండిపడ్డారు. పాలమూరు జిల్లా అభివృద్ధికి అడ్డుపడితే ప్రజలే తగిన సమాధానం ఇస్తారని, తాను మాత్రం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి తీరుతానని చెప్పారు.

ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత నాదే..

ముఖ్యమంత్రిగా తాను ఎక్కడ ఉన్నా జిల్లా అభివృద్ధిని కాంక్షించేవాడినని రేవంత్ రెడ్డి తెలిపారు. అమర్ రాజా బ్యాటరీస్ సంస్థ.. పాలమూరు జిల్లాలో 2 వేల మంది స్థానిక నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇవ్వడానికి అంగీకరించిందని వెల్లడించారు. ఈ ప్రాంతంలో ఏ కంపెనీలు వచ్చినా స్థానిక నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటున్నట్లు ప్రకటించారు. వెనుకబడిన పాలమూరు జిల్లాలో గ్రామ గ్రామానికి, తండాలకు బీటీ రోడ్లు వేసే బాధ్యత తనదే అని సీఎం ప్రకటించారు.

ఆ దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించుకుందామంటూ అధికారులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. సీఎం వెంట జిల్లా ఇన్చార్జి మంత్రులు దామోదర్ రాజనర్సింహ , కోమటి రెడ్డి వెంకటరెడ్డి, శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి, యెన్నం శ్రీనివాస రెడ్డి, వాకిటి శ్రీహరి తదితరులు ఉన్నారు.

ముగిసిన నిట్ టెక్నో జియాన్

- ఆకట్టుకున్న ఈవెంట్లు...
- పోటాపోటీగా పాల్గొన్న విద్యార్థులు..
- 58 పైగా ఈవెంట్లు నిర్వహణ..
- వేడుక ముగియడంతో వెనుదిరిగిన విద్యార్థులు..

జనపదం, కాజీపేట: నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) లో రెండు రోజుల పాటు జరిగిన టెక్నో జియాన్ వేడుకలు ఆదివారంతో ముగిశాయి. అతిథుల ప్రసంగాలతో, విద్యార్థుల కేరింతలతో నిట్ ఆవరణలో సందడి నెలకొంది. శాస్త్ర సాంకేతిక ప్రక్రియల ద్వారా సమస్యలను ఎలా పరిష్కరించవచ్చనదే ఈవెంట్లతో ప్రయోగాత్మకంగా చూపించాయి. టెక్నో జియాన్ ఈవెంట్లలో సుమారు 58 పైగా ప్రదర్శనలను విద్యార్థులు నిర్వహించారు. విద్యార్థులు నూతన టెక్నాలజీ ఆలోచనలతో ముందుకు సాగారు. నూతన ఉరవడితో ఆధునాతన టెక్నాలజీతో విద్యార్థులు ఆలోచనకు అనుకూలంగా ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. విద్యార్థులు చేసే ప్రయోగాలు తోటి విద్యార్థి విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు..

రెండో రోజు టెక్నాలజీని వేడుకలలో ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ సొసైటీ నిర్వహించిన ఓల్టేజ్ ఓవర్టెక్స్, మేనేజ్మెంట్ స్టూడెంట్ లతో నిర్వహించిన ప్రోడక్ట్ లాంచ్, ఎలక్ట్రికల్ అమేచ్యుర్స్, హంక్లబ్ నిర్వహించిన లాంబ్రిత్ ఈవెంట్లు ఎంతగా నో ఆకట్టుకున్నాయి, చాక్లెట్ డిస్పెన్సర్ మెకానికల్ ఇంజనీరింగ్ సొసైటీ నిర్వహించిన మెకానికల్ కిట్ అసెంబ్లీ, ఆస్ట్రానమీ క్లబ్ నిర్వహించిన వండర్ కాస్మోస్, బయోటిక్ సొసైటీ సొల్యూషన్ ఈవెంట్ కంప్యూటర్ గేమ్స్ స్పాట్లైట్ ఈవెంట్ నిర్వహించడం జరిగింది.

చిరునవ్వుతో వెళ్లిన విద్యార్థులు...

రెండు రోజులపాటు జరిగిన టెక్నో జియాన్ లో పాల్గొన్న వివిధ ప్రాంతాల విద్యార్థులు ఆదివారం సాయంత్రం తమ గమ్యస్థానాలకు తరలి వెళ్ళిపోయారు. పోటా పోటీగా సాగిన ఈవెంట్లో గెలిచిన వారితో పాటుగా టెక్నో జియాన్ 24 కు వచ్చిన ప్రతి విద్యార్థి సైతం చిరునవ్వుతో వెళ్లిపోయారు.

మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతి దేవి అంతిమ యాత్ర

నివాళులర్పించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ

జనపదం, కోరుట్ల: దివంగత మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు సతీమణి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతి దేవి శుక్రవారం రాత్రి మృతి చెందారు. శనివారం వారి కుమారులు మృతదేహాన్ని బెంగుళూరు నుంచి మెట్ పల్లికి తీసుకొచ్చారు. ఆదివారం ప్రభుత్వ విప్ లు, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పాల్గొని కొమిరెడ్డి జ్యోతిదేవి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అంతిమ యాత్రలో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గ్రూప్ -3 హాల్ టికెట్లు విడుదల

జనపదం, ఎడ్యుకేషన్: ప్రభుత్వశాఖల్లోని పలు ఉద్యోగాల భర్తీకి నిర్వహించే గ్రూప్-3 పరీక్షల హాల్‌టికెట్లను టీజీపీఎస్సీ విడుదల చేసింది. హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో పొందుపరచగా, ఆదివారం నుంచే డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించింది. గ్రూప్-3 పరీక్షలను ఈనెల 17, 18న నిర్వహించనున్నారు. 17న మొదటి సెషన్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్-1, రెండో సెషన్‌లో మధ్యా హ్నం 3 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్-2కు పరీక్షలు నిర్వహిస్తారు. 18న మొదటి సెషన్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్-3కి పరీక్ష నిర్వహిస్తారు. దీంతో గ్రూప్-3 పరీక్షలు ముగుస్తాయి.

అబద్ధం @ రేవంత్..

(మొదటిపేజీ తరువాయి) భవన్ లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధపు ప్రవాహం తెలంగాణ నుంచి మహారాష్ట్రకు పాకిందన్నారు. ఇక్కడెవరూ నమ్మే పరిస్థితులు లేవని తెలుసుకుని అక్కడికెళ్లి మరీ పరువు తీసుకుంటున్నారన్నారు. తెలంగాణ సంపాదనను మొత్తంగా వేరే రాష్ట్రాలకు పంపిస్తూ పదవిని కాపాడుకునే యత్నం చేస్తూ అసలు పాలననే మరచిపోయిందు.., రేవంత్ రెడ్డి అసమర్థతకు రోడ్ల మీద ఆరబోసిన వడ్లే ప్రత్యక్ష నిదర్శనం..'' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. తెలంగాణ భవన్ లో ఆదివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నిజాలు చెప్పటానికి వెళ్లి మహారాష్ట్రలో అన్నీ అబద్ధాలే చెప్పి వచ్చారన్నారు. రుణమాఫీపై సీఎం చెప్పినవన్నీ అవాస్తవాలే అన్నారు.

అంతా ఉత్తదే....

రేవంత్ రెడ్డి ఇస్తానన్న రుణమాఫీ బోగస్.., రైతుబంధు డబుల్ బోగస్.., వరికి బోనస్ మరింత బోగస్.., ఇలా చెప్పుకుంటూ పోతే హస్తం పాలనలో ప్రతిదీ బోగసే అని హరీస్ రావు అన్నారు. ఆ మాటకొస్తే కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు గ్యారేజ్ కు పోయాయని వ్యంగ్యం గా అన్నారు. రోడ్లమీదున్న వడ్ల కుప్పలే రేవంత్ రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శనం అన్నారు. 40 లక్షల మందికి రుణమాఫీ చేశామని రేవంత్ చెప్పారని, ఇంకా 22లక్షల మందికి రుణమాఫీ జరగాల్సి ఉందనే విషయాన్ని దాచిపెడుతున్నారని, అది జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. 2 లక్షల ఉద్యోగాలు కల్పనపై మహారాష్ట్రలో చెప్పిందంతా అబద్ధమని, విద్యార్థుల వీపులు పగలకొట్టించిన చరిత్ర కాంగ్రెస్ సర్కార్ ది అన్నారు. 10 నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని రేవంత్ పచ్చి అబద్ధాలు చెబుతున్నాడని, నోటిఫికేషన్ ఇచ్చింది లేదు.. ఎగ్జామ్ పెట్టింది లేదు మరి ఎలా 50,000 ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. అశోక్ నగర్ లైబ్రరీలో నిరుద్యోగులపై లాఠీచార్జ్ చేయించిన ఘనత రేవంత్ రెడ్డి దని, అర్ధరాత్రి ఆడపిల్లల్ని అరెస్ట్ చేయించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, ఉద్యోగాల భర్తీలో వైఫల్యంపై మహారాష్ట్రలో ఎందుకు చెప్పలేదని, జీవో 29 తో ఎస్సీ, ఎస్టీ, బీసీ లకు అన్యాయం చేసిన మాట వాస్తవం కాదా సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు.

మోసంలో మాస్టర్ డిగ్రీ..

రేవంత్ అబద్ధాల ప్రవాహాన్ని మహారాష్ట్రలో కొనసాగించారని, ఇక్కడి ప్రజలను మోసం చేసినట్టు అక్కడి వారిని కూడా చేయాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. దాదాపు ఏడాది పూర్తి కావస్తున్నా వందరోజుల్లో పూర్తి చేస్తామన్న ఆరు గ్యారెంటీలు ఇంకా అమలు కావడం లేదన్ని దుయ్యబట్టారు. ఆరు గ్యారంటీల అమలు విషయమై ఎక్కడ చర్చించడానికైనా సిద్ధమని సవాల్ విసిరారు. అభయహస్తంలో మొదటి హామీ మహిళకు రూ. 2500 దిక్కులేదన్నారు. ఇప్పటికే ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ. 27500 బాకీ ఉందన్నారు. తాను మొదటి సంతకం చేసిన ఏక కాలంలో రుణమాఫీ కూడా చేయాలేదన్నారు. డిసెంబర్ 9, 2023 రోజు రుణమాఫీ చేస్తామని మాట తప్పామని మహారాష్ట్ర ప్రజలకు బహిరంగంగా చెప్పాలన్నారు. రూ.4000 ఫించన్ ఇస్తానని వృద్ధులను మోసం చేశారు. ఒక్కొక్కరికి రూ. 26 వేల పెన్షన్ చొప్పున 41 లక్షల మంది పెన్షన్ దారులకు ప్రభుత్వ బాకీ పడిందన్నారు. అన్ని వర్గాలను మోసం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి చరిత్ర లిఖించారన్నారు.

భారం మోపుతున్న

సర్వేపై అనుమానాలొద్దు..

- ప్రజలంతా అధికారులకు సహకరించాలి
- ప్రజా ప్రతినిధులు సర్వేలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించాలి
- జీవో 18 ద్వారా ప్రభుత్వం చేస్తున్న సర్వే గోప్యంగా ఉంటుంది..
- క్రీడల్లో హుస్నాబాద్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండాలి
- భవిష్యత్ లో రాష్ట్ర స్థాయి క్రీడలు ఇక్కడే నిర్వహిస్తాం..
- మంత్రి పొన్నం ప్రభాకర్

జనపదం, సిద్దిపేట : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలో ఎన్యుమరెటర్స్ తో కలిసి స్వయంగా సర్వే లో పాల్గొని వివరాలు నమోదు చేశారు. ప్రజా ప్రతినిధులు ఇంటింటి కుటుంబ సర్వే లో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. సర్వే ద్వారా మీ కుల బలమెందో తెలిస్తే అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక వేయడానికి అవకాశం ఉంటుందని, సర్వే కి సహకరించాలని తెలంగాణ వ్యాప్తంగా కుల సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమగ్ర సర్వే ద్వారా ఎవరెంతో వారికంత ఆలోచనలతో తేడాలు సరిచేయడానికి ఉపయోగపడుతుందని మంత్రి పేర్కొన్నారు. సర్వే అనారోగ్యంతో ఉన్న మనిషి లోపాలను గుర్తించడానికి ఎక్స్ రే లాగా సామాజిక రుగ్మతలను రూపుపడానికి ఉపయోగపడుతున్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, అధికారులు చారిత్రాత్మక కార్యక్రమంలో భాగస్వామ్యం అయి ప్రజలు వివరాలు ఇచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి స్టేడియంగా తీర్చి దిద్దుతా..

హుస్నాబాద్ ఇండోర్ స్టేడియంలో 68 వ అండర్ -14 బాయ్స్ అండ్ గర్ల్స్ ఎస్ జీ ఎఫ్ స్టేట్ లెవెల్ హ్యాండ్ బాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. అండర్ -14 బాయ్స్ అండ్ గర్ల్స్ హ్యాండ్ పోటీల్లో ఫైనల్లో అదిలాబాద్, వరంగల్ బాలికలు, కరీంనగర్, వరంగల్ బాయ్స్ కి బహుమతుల ప్రదానం చేశారు. హుస్నాబాద్ లో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు మొదటిసారి జరగడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. హుస్నాబాద్ స్టేడియం విస్తీర్ణం పెంచుకొని రాబోయే కాలంలో అన్ని క్రీడలకు వేదిక కావాలనీ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. హుస్నాబాద్ లో క్రీడలకు మరింత ప్రోత్సాహం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అన్ని రకాల కార్యక్రమాలు చేపడ తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం లో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి సియోల్ లో స్పోర్ట్స్ యూనివర్శిటీ చూసిన తరువాత స్ఫూర్తి పొంది యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. రాబోయే యంగ్

ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ లో హుస్నాబాద్ నుంచి అధిక సంఖ్యలో అడ్మిషన్లు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకు క్రీడా ఉపాధ్యాయులు మరింత ప్రోత్సాహం విద్యార్థులకు అందించాలన్నారు. హుస్నాబాద్ లో క్రీడలను పెంచడానికి ప్రత్యేక శిక్షకుడిని నియమించామని అథ్లెటిక్స్, వ్యాయామం, కబడ్డీ తదితర పోటీల్లో శిక్షణ ఇస్తున్నారన్నారు. రాబోయే కాలంలో స్విమ్మింగ్ పూల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే షటిల్ కోర్టు లో సింథటిక్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్టేడియంలో డ్రెస్సింగ్ రూమ్, టాయిలెట్స్ ఏర్పాటు త్వరలోనే పూర్తి అవుతాయ న్నారు. విద్యార్థులకు మండల స్థాయి క్రీడలు నిర్వహించాలని విద్యాధికారిని ఆదేశించారు. క్రీడల్లో రాణించి గ్రామానికి, రాష్ట్రానికి, దేశానికి, తల్లిదండ్రులకు పేరు తేవాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడిన వారికి ప్రోత్సహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, వైస్ చైర్మన్ ఐలేని అనిత, సిద్దిపేట గ్రంథాలయ కమిటీ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, కౌన్సిలర్లు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

జై జవాన్.. జై కిసాన్..

- దేశంలో ఆ ఇద్దరే త్యాగ మూర్తులు
- వాళ్లిద్దరూ లేకుండా ఏ దేశం మనుగడ సాధించలేదు
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

జనపదం, హైదరాబాద్ : మనం బతకడానికి అన్నం పెట్టే రైతు, మనం ప్రశాంతంగా జీవించడానికి రక్షణగా ఉండేది సైనికుడు.. వీళ్లిద్దరూ లేకుండా దేశం కానీ ఆ దేశ ప్రజలు గాని మనుగడ సాగించడం అసాధ్యమని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. వాయుపురి లో 'ఆల్ ఇండియా ఎక్స్ సర్వీస్ మెన్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్' జనరల్ బాడీ మీటింగ్ ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఈటల రాజేందర్ హాజరై మాట్లాడారు. ఇద్దరే ఇద్దరు త్యాగమూర్తులు ఈ దేశంలో. ఒకరు తుపాకీ ట్రిగర్ మీద వెలు పెట్టి ప్రతిక్షణం భారతమాతను కాపాడే సైనికులు. రక్తాన్ని చెమటగా మార్చి దేశ ప్రజల బుక్కెడు బువ్వ పెట్టేవాడు. జై జవాన్.. జై కిసాన్.. ఇది త్యాగాలతో కూడిన నినాదం అని అన్నారు. మోడీ వచ్చిన తర్వాత సైన్యానికి అనేక రకాల సౌకర్యాలు వచ్చాయని, అనేక రకాల హక్కులు కల్పించిందని తెలిపారు. 20 ఏళ్ల ఆర్మీలో సేవలు అందించి తర్వాత మళ్ల ఇతర ఉద్యోగాలు కల్పించాలనే డిమాండ్ ఉందో.. పరిష్కారా నికి తన వంతుగా ప్రయత్నం చేస్తానని చెప్పారు. రాష్ట్ర కన్వీనర్ గోపు రమణారెడ్డి, ఆలిండియా ఎన్ ఎక్స్ సీసీ చైర్మన్ లింగాల జగన్ రెడ్డి మాట్లాడుతూ సైన్యంలో ఉన్నప్పుడే ఏళ్ల తరబడి భార్య పిల్లలకుదూరంగా ఉండి రిటైర్మెంట్ అయిన తరువాత బ్యాంకు ఉద్యోగంలో చే రగా, ఇంటికి చాలా కిలోమీటర్ల దూరంలో డ్యూటీ వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యో గులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దిపేటలో తీవ్ర విషాదం..

- ఇద్దరు పిల్లలతో కలిసి చెరువులో దూకి తండ్రి ఆత్మహత్య
- సెల్ఫీ వీడియో, సూసైడ్ నోట్ లభ్యం
- కేసు నమోదు చేసిన పోలీసులు

జనపదం, సిద్దిపేట : సిద్దిపేట జిల్లా కేంద్రం లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. స్థానిక చింతలచెరువులో ఓ తండ్రి తన ఇద్దరు పిల్లలతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంచలనంగా మారింది. వారు సిద్దిపేట వాసవీనగర్ కు చెందిన తేలు సత్యం (48), అతడి కుమారుడు అన్వేష్ (7), కూతురు త్రివేణి (5) గా పోలీసులు గుర్తించారు. ఏసీపీ మధు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. తేలు సత్యం తన సోదరుడు తేలు శ్రీనివాస్ ను చదివించడం, ఆయన బాగోగులు చూసుకున్నాడు. ఈ క్రమంలో సత్యం అనారోగ్యం బారిన పడగా తన తమ్ముడి నుంచి రావాల్సిన డబ్బులు, ఇంటి విషయంలో శ్రీనివాస్ కు ఇచ్చిన డబ్బులు తనకు ఇవ్వాలని సుమారుగా సత్యం తరచూ అడిగేవాడు. 20 రోజుల క్రితం తనకు రావాల్సిన రూ.5 లక్షల 50 వేలు ఇవ్వమని అడగడంతో తమ్ముడు శ్రీనివాస్ అన్న సత్యంను బూతులు తిట్టి చెప్పుతో కొట్టి ఇంటి నుండి వెళ్లగొట్టాడు. డబ్బులు ఇవ్వకపోవడమే కాక నీకు ఇచ్చే డబ్బులు ఎవరికైనా ఇచ్చి నిన్నే చంపిస్తానని బెదిరించాడు. మృతుడు ఈ విషయాలన్నీన మనసులో పెట్టుకొని సరిగ్గా తినకుండా మానసిక క్షోభకు గురయ్యాడు. శనివారం ఉదయం నుంచి ఏమీ తినకుండా ఉన్న సత్యం సాయంత్రం ఏడు గంటలకు ఇంటి నుంచి తన ఇద్దరు పిల్లలను తీసుకొని బయటికి వెళ్ళాడు. తొమ్మిది గంటలైనా ఇంటికి రాకపోవడంతో భార్య తన భర్త, పిల్లల గురించి ఆరా తీసింది. తెలిసిన వారితో మాట్లాడి చాలా చోట్ల వెతకగా ఆదివారం తెల్లవారు జామున చింతలచెరువు కట్టవైపు కట్టపై సత్యం టూ వీలర్, సెల్ ఫోన్ కనపడింది. ఆ ఫోన్లో సత్యం ఇద్దరు పిల్లలు చెరువులో పడి మరణించడానికి గల కారణాన్ని సెల్ఫీ వీడియో తీసి అలాగే సూసైడ్ నోట్ కూడా రాసి చనిపోయాడన్నారు. భర్త మరణానికి కారణమైన మరిది తేలు శ్రీనివాస్ పై చర్యలు తీసుకోవాలని సత్యం భార్య ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా, గజ ఈతగాళ్ల సహాయంతో ముగ్గురు మృతదేహాలను బయటకు తీసి ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

తెలంగాణ బియ్యాన్ని దిగుమతి చేసుకుంటాం..

మంత్రి శ్రీధర్ బాబుకు మలేషియా దిగుమతిదారులు హామీ

జనపదం, ప్రతినిధి : తెలంగాణలో పండిన బియ్యాన్ని తాము దిగుమతి చేసుకుంటామని మలేషియాకు చెందిన దిగుమతిదారులు మంత్రి శ్రీధర్ బాబుకు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం జరిగిన మలేషియా బిజినెస్ మీట్ లో మంత్రి శ్రీధర్ బాబు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సాట్ చైర్మన్ శివసేన రెడ్డి, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో సాగవుతున్న వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాల గురించి మలేషియా దిగుమతిదారులకు మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. అలాగే తెలంగాణలో సాగు చేస్తోన్న వరి, ఇతర ధాన్యాల రకాల గురించి, నాణ్యత తదితర విషయాలను వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ అల్దాస్ జానయ్య వివరించారు.

కారు బోల్తా.. ఇద్దరు యువకుల మృతి

ముచ్చర్ల గేటు సమీపంలో ఘటన

జనపదం, ఇబ్రహీంపట్నం : హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో హైదారాబాద్ కు చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. హైదరాబాద్ నుంచి కడ్తాల్ వైపు మహేంద్ర ఎక్స్యూవి (టీఎస్09ఈహెచ్0362) వాహనంలో వస్తుండగా కందుకూరు మండలం ముచ్చర్ల గేటు సమీపంలో ఈ ఘటన జరిగింది. మృతులు పహాడీ షరీఫ్ ప్రాంతానికి చెందిన నయాబ్, ఇంతియాజ్ గా గుర్తించారు. వీరంతా శ్రీశైలం డ్యాం సందర్శనకు వెళ్తున్నట్లు తెలిసింది. మిగతా ఐదుగురు స్వల్ప గాయాలతో ప్రమాదం నుండి బయట పడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న గ్రీన్ ఫార్మా సిటీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హరీష్ రావు..అబద్ధాలు మానుకో..

- వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి
- అధికారం దూరం కావడాన్ని తట్టుకోలేకే తప్పుడు ఆరోపణలు
- గ్రామ పంచాయతీ భవనం తాకట్టు ట్వీట్ పై మంత్రి సీతక్క ఫైర్

జనపదం, జగిత్యాల : జగిత్యాల జిల్లా తొంబరావుపేట గ్రామంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి సంబంధించి రూ.17 లక్షల బిల్లులు పెండింగ్లో ఉన్నట్లుగా ఓ పత్రికలో కథనం రావడం.. దాన్ని కనీసం చెక్ చేసుకోకుండానే మాజీ మంత్రి హరీష్ రావు ట్వీట్ చేయడం పట్ల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం మీడియా, సోషల్ మీడియాలో ఉండేందుకు పాకులాడుతూ.. తప్పుడు ప్రచారం చేయడాన్నే హరీష్ రావు పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. గత నెల 19 వ తేదీన మాజీ సర్పంచ్ మామిడి సత్తమ్మకు రూ.7,46,787 చెక్ లకు ఇవ్వగా 23 అక్టోబర్ న మాజీ సర్పంచ్ డబ్బులు విత్ డ్రా చేసుకున్నట్లు అధికారులు తన దృష్టికి తీసుకొచ్చారని సీతక్క తెలిపారు. ఇంకా గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పూర్తి కాలేదని, ప్లాస్టరింగ్ పనులు పెండింగ్ లో ఉన్నాయని.. పనులు పూర్తి చేసిన తర్వాత బిల్లులు సమర్పించాలని మాజీ సర్పంచ్ కు అధికారులు సూచించగా..ఇప్పటి వరకు బిల్లులు సమర్పించలేదని జిల్లా అధికారులు తనకు నివేదిక సమర్పించారన్నారు.

దీనిపై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. ఓ మీడియాలో వచ్చిన కథనంపై వాస్తవాలు తెలుసుకోకుండా హరీష్ రావు ట్వీట్ చేయడాన్ని మంత్రి సీతక్క తప్పుబట్టారు. లేని అంశాలున్నట్లు భ్రమింప చేయడాన్ని హరీష్ రావు మా నుకోవాలని సూచించారు. అవస్తవాలను ప్రచారం చేసి అధికారంలోకి వచ్చేందుకు హరీష్ ఆరాట పడుతున్నారని మండిపడ్డారు. అయితే సెంటిమెంట్ రాజకీయాలు, లేకపోతే అవస్తవాలు ఇవే హరీష్ రావు నైజామా.. అని మంత్రి సీతక్క ప్రశ్నించారు. జీపీ భవనానికి సంబంధించి రూ.7,46,787 చెల్లింపులు జరిగాయని, మిగిలిన పనులు పూర్తి కాకుండా మొత్తం బిల్లులు చెల్లించాలా..? అని ప్రశ్నించారు. పదేళ్లు మంత్రిగా ఉన్న హరీష్ రావు పనులు కాకుండానే బిల్లులు చెల్లించారా అని ఆగ్రహం వ్యక్తం చేసారు. అధికారం దూరం కావడాన్ని హరీష్ రావు తట్టుకోలేకపోతున్నారని..అందుకే ప్రజలకు అన్యాయం జరుగుతున్నట్లుగా లేని పోని ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. మీ బాధను ప్రజల బాధగా ప్రచారం చేయోద్దని సూచించారు. గత ప్రభుత్వంలో బిల్లులు చెల్లించక సర్పంచ్ లు ఆత్మహత్యలు చేసుకున్నారని సీతక్క గుర్తు చేశారు. చేసిన పనులకు బిల్లులు తీసుకుని, బిల్లులు రాలేదని తప్పుడు ప్రచారం చేస్తే కేసులు తప్పవని మంత్రి సీతక్క హెచ్చరించారు

జాతి ఐక్యత కోసం ప్రతి మాదిగ బిడ్డ శ్రమించాలి..

వర్గీకరణ సాధించుకునే వరకు పోరాటం చేయాలి

మాదిగ ఆత్మీయ సమ్మేళనంలో పలువురు వక్తలు

జనపదం, భువనగిరి : జాతి ఐక్యత కోసం మాదిగ బిడ్డలంతా శ్రమించి వర్గీకరణ సాధించుకునే వరకు పోరాటం చేయాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, ప్రొఫెసర్ ముత్తయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలోని ఎస్వీ గార్డెన్లో జరిగిన మాదిగ ఆత్మీయుల సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మాదిగ జాతి కోసం ఐక్యత కోసం రాజకీయాలతో పని లేకుండా ఉద్యోగ సంఘాలు, డాక్టర్లు, లాయర్లు, ప్రజా ఉద్యమకారులు ఏకకంఠంతో పెద్ద ఎత్తున జాతి యొక్క ఆసక్తిని ప్రదర్శించాలన్నారు.ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ సాధించుకునేందుకు ఐక్యతతో అందరం కలిసి కృషి చేయాలన్నారు. నల్గొండలో జరిగే సభ విజయవంతం చేసేందుకు లక్ష మంది మాదిగ జనాన్ని సమీకరించుటకు ఇక్కడ వచ్చిన ప్రతినిధులు అంతా ప్రతినభూని విజయవంతం చేయాలన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఉన్నతమైన తీర్పును స్వాగతిస్తూ జాతి ఐక్యత కోసం ప్రతి ఒక్క మాదిగ బిడ్డ వర్గీకరణ సాధించుకునే అంత వరకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాగారం అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బట్టు రామచంద్రయ్య, బర్రె జహంగీర్, వేముల అశోక్, సుదర్శన్, నల్ల కృష్ణ, దుబ్బ రామకృష్ణ,ఇటుకల దేవేందర్, కోళ్ల జాంగిర్, కనుకుంట్ల కోటేష్, సిరిపంగ సుభాష్, కాంచనపల్లి నర్సింగ రావు, జనగాం పాండు, సిరిపంగ శివలింగం, పాశం విటల్, బర్రె ప్రమీల, వీరస్వామి, ఈరపాక నరసింహ, ప్రదీప్, గణేష్, బండారు రఘువర్ధన్, నల్ల చంద్ర స్వామి, మంద శంకర్, నరేందర్, కొండేటి మల్లయ్ కొల్లూరు హరీష్, బండారు శివ శంకర్, సిల్వర్ మధు, కందుల శంకర్, మాటూరు ఆంజనేయులు, దర్గాయి హరిప్రసాద్, దండు నరేష్, జాలిగం విగ్నేష్, దర్గాయి గణేష్, గ్యాస్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

కారు నడిపిన కేసీఆర్..

- ఫామ్ హౌజ్ లో పంట పొలాల సందర్శన
- సోషల్ మీడియాలో వైరల్
- టైగర్ ఈజ్ బ్యాక్ అంటూ అభిమానులు కామెంట్లు
- కూలగొట్టడం కాదు. నిలబెట్టాలి
- హైడ్రా కూల్చివేతలపై పరోక్ష విమర్శలు
- ఆత్మహత్యకు యత్నించిన గిరిజన బిడ్డకు రూ.3 లక్షల ఆర్థికసాయం

జనపదం, ఎర్రవల్లి : బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ కారు నడిపారు. గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బెంజ్ కారును డ్రైవింగ్ చేస్తూ పంట పొలాలను పరిశీలించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తనయుడు, చేవెళ్ల యువనేత పట్లోల్ల కార్తీక్ రెడ్డి.. కేసీఆర్ పక్కన ఉన్నారు. కేసీఆర్ కారు డ్రైవింగ్ చేస్తున్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. టైగర్ ఈజ్ బ్యాక్ అంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. 'కారు మాదే.. నడిపేది మేమే' అంటూ ఓ యూజర్ కామెంట్ పెట్టాడు. 'ఈసారి కారు జోరును అడ్డుకోలేరు' అంటూ మరో యూజర్ కామెంట్ చేశాడు.

యాక్టివ్ మోడ్ లో కేసీఆర్

కొంత కాలంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్న బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు తిరిగి యాక్టివ్ అవుతున్నట్లు కనిపిస్తోంది. గజ్వేల్లోని ఎర్రవెల్లి ఫామ్ హౌస్లో పాలకుర్తి నియోజకవర్గం నేతలతో కేసీఆర్ సమావేశం అయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. హైడ్రా కూల్చివేతలు, సీఎం రేవంత్ రెడ్డి విమర్శలపై స్పందించారు. త్వరలో జిల్లాల యాత్రలు చేసే అవకాశం ఉన్నట్లు బీఆర్ఎస్ శ్రేణులు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా.. ఎర్రవల్లి ఫాం హౌస్లో కారు నడుపుతూ కేసీఆర్ కనిపించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కు మారుడు, చేవెళ్ల యువనేత పట్లోల్ల కార్తీక్ రెడ్డిని పక్కన కూర్చో బెట్టుకొని కారు నడిపారు కేసీఆర్. ఫామ్ హౌస్లో సాగవుతున్న పంట పొలాలను పరిశీలించి, వాటి గురించి కార్తీక్ రెడ్డికి వివరించినట్లు తెలుస్తోంది. కేసీఆర్ నడిపిన కారు 'మెర్సిడెస్ బెంజ్'. వైట్ కలర్లో కారు రాయల్గా కనిపిస్తోంది. ఈ ఏడాది జులైలో కేసీఆర్ ఓమ్నీ వ్యాన్ నడిపిన సంగతి తెలిసిందే. డాక్టర్ల సూచనతో నాడు ఆయన తన ఫాం హౌస్లో వ్యాన్ నడిపారు. ఒంటరిగా కాసేపు వ్యాన్లో కలియతిరిగారు. గత ఏడాడి డిసెంబర్ 8న అర్ధ రాత్రి ఇంట్లో కాలు జారిపడటంతో కేసీఆర్ తుంటి ఎముక విరిగింది. యశోదా ఆస్పత్రిలో డాక్టర్ల చికిత్స అనంతరం కోలుకున్న కేసీఆర్.. ఎర్రవెల్లి ఫాం హౌస్ లో విశ్రాంతి తీసుకుంటున్నారు. 'ప్రభుత్వం అంటే అందరినీ కాపాడాలి. నిర్మాణాత్మకంగా పనిచేయాలి. కూలగొట్టడం కాదు.. నిలబెట్టాలి' అని కేసీఆర్ అన్నారు. పరోక్షంగా హైడ్రా కూల్చివేతలను ఖండించారు. 'ప్రభుత్వంలో ఉన్న వాళ్లు ఎలా మాట్లాడుతున్నారో మీరు చూస్తున్నారుగా.. మాకూ మాట్లాడటం వచ్చు' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఉద్దేశించి కేసీఆర్ అన్నారు. సినీ నిర్మాత, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ పారుపాటి శ్రీనివాస్, ఆర్టిస్ట్ రవితేజ.. శనివారం ఎర్రవెల్లి ఫాం హౌస్లో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్లో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడారు. పార్టీ నాయకులు, శ్రేణులు కష్టపడి పనిచేయాలని, వచ్చే ఎన్నికల్లో వందకు వంద శాతం తమ పార్టే అధికారంలోకి వస్తుందని కేసీఆర్ చెప్పారు. ప్రజలు ఏం కోల్పోయారో వారికి అర్థమవుతోందన్నారు.

గిరిజన బిడ్డకు రూ. 3 లక్షల సాయం

మూడు రోజుల కిందట పాలకుర్తి పోలీస్ స్టేషన్ ముందు పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న గిరిజన బిడ్డ లకావత్ శ్రీనివాస్ నాయక్ కుటుంబానికి రూ. 3 లక్షల ఆర్థిక సాయం చేశారు కేసీఆర్. ఎర్రవెల్లి ఫాంహౌస్లో శ్రీను నాయక్ తల్లిదండ్రులకు చెక్ అందించారు. వారి కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు కేసీఆర్.

అన్నదాతలు అధైర్య పడొద్దు..

- చివరి గింజ వరకు ప్రభుత్వం కొంటది..
- కొనుగోళ్లను వేగవంతం చేయాలి
- ప్రతి మిల్లుకు ఓ అధికారిని ఏర్పాటు చేశాం
- సహకరించని మిల్లులను సీజ్ చేస్తాం
- తప్పులు లేకుండా సర్వేను చేపట్టాలి
- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

జనపదం, భూదాన్ పోచంపల్లి : రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర ఇస్తుందని, రైతులు అధైర్య పడొద్దని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ఆదివారం భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని పీఏసీఎస్ తో పాటు మండలంలోని జూలూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. అదేవిధంగా నారాయణగిరిలో ఇంటింటి సమగ్ర సర్వే ను, జగత్ పల్లి గ్రామంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్ని బ్యాగులు, హమాలీ కొరత లేదని, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మిల్లుకు ఓ ప్రత్యేక అధికారిని నియమించామని, సహకరించని మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో అత్యధికంగా పేమెంట్ ఇచ్చిన జిల్లాలో యాదాద్రి భువనగిరి జిల్లా 8 వ స్థానంలో ఉందని, అత్యధికంగా ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో యాదాద్రి జిల్లా రెండో స్థానంలో ఉందన్నారు. రెండు రోజుల్లో జూలూరు సెంటర్ కు రూ. రెండు కోట్లు రానున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వేలో భాగంగా ప్రతి 150 ఇండ్లకు ఒక ఇన్యూమరేటర్ ను పెట్టామని, సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య అంశాలపై ప్రతి కుటుంబ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. విధుల్లో ఎలాంటి అలసత్వం వహించకుండా సర్వేను పకడ్బందీగా చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం రెండు లక్షల 55 వేల కుటుంబాలను గుర్తించామని అందుకుగాను 1789 మంది ఇన్యుమరేటర్లను పెట్టామన్నారు. అదేవిధంగా 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటర్ లిస్టులో మార్పులు చేర్పులు తదితర అంశాల కోసం బీ ఎల్ ఓ లను సంపాదించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శేఖర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, తహసీల్దార్ మహేందర్ రెడ్డి, డీసీవో వనజాత, సివిల్ సప్లై డీఎం జగదీష్ కుమార్, డీసీవో శ్రీధర్, ఏడీఏ వెంకటేశ్వరరావు, ఏవో శైలజ, డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరావు, ఎమ్మార్వో వెంకటరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అందేల లింగం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఐకత్యతోనే భద్రత.. బలం

ఓబీసీలను విభజించడానికి కాంగ్రెస్ కుట్ర జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్రమోడీ

జనపదం, రాంచీ: ఓబీసీలను విభజించడానికి కాంగ్రెస్–, జేఎంఎం ప్రయత్నిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రయత్నాలు ఫలించకూడదంటే ప్రజలు ఐక్యంగా ఉండాలని సూచించారు. ఐక్యత ఉన్నప్పుడే భద్రత ఉంటుందని పేర్కొన్నారు. గతంలో ఓబీసీలు, గిరిజనులు, దళితుల మధ్య ఐక్యత ఏర్పడనంత వరకు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తూనే ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్, జేఎంఎంలు పన్నే కుట్రల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అధికారాన్ని చేజిక్కించుకోవడానికి అవి ఎంతకైనా దిగజారుతాయని, దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ఐక్యతకు వ్యతిరేకంగా కాంగ్రెస్ వ్యూహాలు పన్నుతూ దేశాన్ని దోచుకుందని చెప్పారు. ఛోటానాగ్పూర్ ప్రాంతంలో 125 కంటే ఎక్కువ ఉపకులాలు ఓబీసీలుగా పరిగణించబడుతున్నాయని, ఉపకులాలను ఒకదానితో ఒకటి ఇరకాటంలో పెట్టడం ద్వారా కాంగ్రెస్, జేఎంఎంలు ఓబీసీల ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని అనుకుంటున్నాయని, కాబట్టి ప్రజల్లో ఐక్యత ఉంటేనే భద్రత ఉంటుందని అని ప్రధాని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ లో ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలని కాంగ్రెస్ దాని మిత్ర పక్షాలు కోరుతున్నాయని.. అది కానీ జరిగితే మళ్లీ మన సైనికులు ఉగ్రవాద దాడులను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కశ్మీర్లో ఆర్టికల్ 370ని తీసుకువచ్చారని, ఏడు దశాబ్దాలుగా అక్కడ రాజ్యాంగం అమలులో లేదని ఆయన అన్నారు. భారత రాజ్యాంగంపై తొలిసారిగా జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారం చేశారని, ఇదే అంబేద్కర్ కు ఆయన అర్పిస్తున్న నివాళి అని మోడీ అన్నారు. చొరబాటుదారులను తరిమికొట్టేందుకు, అవినీతి నిర్మూలనకు ఝార్ఖండ్ లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం అవసరమని ప్రధాని పేర్కొన్నారు. అధికార జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణం సృష్టించిన రిక్రూట్మెంట్ మాఫియా, పేపర్ లీక్ మాఫియాలను జైలుకు పంపుతామని, యువత భవిష్యత్ తో ఆడుకున్న వారిని వదిలిపెట్టబోమని మోడీ హెచ్చరించారు. రాష్ట్రంలోని హేమంత్ సోరెన్ ప్రభుత్వం విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతోందని ప్రధాని ఆరోపించారు. ఇండియా కూటమి ప్రజలను దోచుకుందని దుయ్యబట్టారు. భాజపా అధికారంలోకి వచ్చిన అనంతరం అవినీతికి పాల్పడిన వారికి కఠిన శిక్ష విధించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గతంలో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ దశాబ్ద కాలంగా ఝార్ఖండ్ కు రూ.80వేల కోట్లు కేటాయించడానికి ఇబ్బందులు పడ్డారని.. తమ ప్రభుత్వం గత పదేళ్లలో రాష్ట్రానికి రూ.3లక్షల కోట్లకుపైగా నిధులు మంజూరు చేసిందని ప్రధాని వెల్లడించారు.

నేడే సీజేఐ ప్రమాణం..

- బాధ్యతలు స్వీకరించనున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా
- అత్యున్నత న్యాయస్థానానికి 51వ ప్రధాన న్యాయమూర్తిగా విధుల్లోకి..
- ఆదివారం జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీ విరమణ..

జనపదం, న్యూఢిల్లీ: సుప్రీం కోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం ప్రమాణం చేయనున్నారు. జస్టిస్ సంజీవ్ ఖన్నాతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ప్రస్తుత చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీ కాలం ఆదివారంతో ముగుస్తున్నది. ఆయన స్థానంలో సుప్రీం కోర్టు సీజేఐగా ఎంపికైన జస్టిస్ సంజీవ్ ఖన్నా 2019 జనవరి నుంచి సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా సేవలు అందిస్తున్నారు. 2025 మే రెండో వారం వరకూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సంజీవ్ ఖన్నా వ్యవహరిస్తారు. ఖన్నా కుటుంబ సభ్యుల నుంచి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన సంజీవ్ ఖన్నా మూడో వ్యక్తి.. అంతకు ముందు ఢిల్లీ హైకోర్టు జడ్జిగా పని చేసిన దేవీరాజ్ ఖన్నా కొడుకే సంజీవ్ ఖన్నా.. సుప్రీం కోర్టు జస్టిస్ హెచ్ఆర్ ఖన్నాకు సమీప బంధువు.. జస్టిస్ సంజీవ్ ఖన్నా పలు చారిత్రక తీర్పులు ఇచ్చిన వారిలో ఒకరు.. ఈవీఎం ల పవిత్రతతో పాటు ఎన్నికల బాండ్ల రద్దు, 370 ఆర్టికల్ రద్దు, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ వంటి కేసుల్లో తీర్పులు ఇచ్చారు. 1960 మే 14న జన్మించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా.. ఢిల్లీ యూనివర్సిటీలో న్యాయ విద్యను అభ్యసించారు. నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ (ఎన్ఏఎల్ఎస్ఏ) ఎగ్జిక్యూటివ్ చైర్మన్ గా పని చేశారు. 1983 లలో న్యాయవాదిగా ఢిల్లీ బార్ కౌన్సిల్ లో పేరు రిజిస్టర్ చేసుకున్నారు. తొలుత తీస్ హజారీ కాంప్లెక్సు లోని జిల్లా కోర్టుల్లో న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. సుదీర్ఘ కాలం ఆదాయం పన్ను విభాగం సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్ గా కొనసాగిన సంజీవ్ ఖన్నా.. 2004లో ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ టెర్రిటరీ స్టాండింగ్ కౌన్సిల్ (సివిల్) గా నియమితులయ్యారు. 2005లో ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులైన సంజీవ్ ఖన్నా.. తదుపరి ఏడాది శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ప్రమోషన్ పొందారు.

ఇక, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా వైదొలుగుతున్న డీవై చంద్రచూడ్ శుక్రవారం నలుగురు న్యాయమూర్తుల బెంచ్ కు సారథ్యం వహించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా ఎనిమిదేండ్ల చరిత్రలో రికార్డు స్థాయిలో 38 రాజ్యాంగ ధర్మాసనాలు ఏర్పాటు చేశారు. గత రెండేండ్లుగా 21,358 కేసుల్లో బెయిల్ తోపాటు 1.07 లక్షల కేసులను పరిష్కరించారు. చివరి పని దినం శుక్రవారం తన కెరీర్ లో చేపట్టిన విషయాలను వెల్లడించారు. జస్టిస్ చంద్రచూడ్ సేవలను సీజేఐ గా ఎంపికైన జస్టిస్ రాజీవ్ కన్నా, అటార్నీ జర్నల్, సొలిసిటర్ జర్నల్, సుప్రీంకోర్ట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కపిల్ సిబాల్ ప్రశంసించారు..

మజ్లిసే అడ్డంకి..

(మొదటిపేజీ తరువాయి) పార్టీ కార్పొరేటర్లు, ఎమ్మెల్యేల వలన నిర్లక్ష్యానికి గురైన నాంపల్లి నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ డిపార్ట్ మెంట్ల సాయంతో సుమారు రూ.78 లక్షలతో కమ్యూనిటీ హాళ్లు, ఓపెన్ జిమ్స్, బోర్ వెల్స్ వంటి అనేక సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేస్తున్నామని వెల్లడించారు. అభివృద్ధి కార్యక్రమాలు ముందుకుసాగేలా బస్తీ నాయకులు రాజకీయాలకు అతీతంగా ముందుకు రావాలని కోరారు.

నిధుల కొరత..

హైదరాబాద్ నగరంలో జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ డిపార్టుమెంట్ కు నిధుల కొరత వేధిస్తుందన్నారు. కనీసం వీధిలైట్ల నిర్వహణ సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదని, అందుకే వారు సమ్మెకు దిగారన్నారు. హైదరాబాద్ లోని అంబర్ పేట, ఖైరతాబాద్, సికింద్రాబాద్, నాంపల్లి, గోషామహాల్ నియోజకవర్గాల్లోని పలు బస్తీలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడం లేదని ఆయన మండిపడ్డారు. జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ డిపార్ట్ మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్లకు నిధుల కొరతతో అరకొర సౌకర్యాలతో పాఠశాలలు నడుస్తున్నాయని అన్నారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి నిధుల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కిషన్ రెడ్డి సూచించారు.

మా ముచ్చట్లు మీకెందుకు..?

- ధరణి వివరాలు ఎందుకు చెప్పాలి
- సర్వే అవసరం లేదు.. వెళ్లండి..
- మేం చాలా రిచ్.. మీ లెక్క మాకవసరం లేదు
- కులగణనపై ప్రజల్లో వ్యతిరేకత...
- గ్రామాల్లో బహిష్కరణలు
- ఎన్యూమరేటర్లకు తప్పని తిప్పలు..

జనపదం, హైదరాబాద్ బ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వే బాలారిష్టాలు దాటడం లేదు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే రెండో దశ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సవాలక్ష సమస్యలతో సాగుతున్నది. ఇటు రాష్ట్ర వ్యాప్తంగా అదే పరిస్థితి నెలకొన్నది. హైద్రాబాద్లో పరిశీలిస్తే.. 29 లక్షల ఇళ్లకు గాను తొలి దశలో మూడు రోజుల నుంచి 22 లక్షలకుపైగా ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. కొన్ని ప్రాంతాల్లో ఇంకా స్టిక్కరింగ్ పూర్తి కాకపోవడం, సిబ్బంది ఓటరు నమోదు కార్యక్రమంలో ఉండటంతో మధ్యాహ్నం తర్వాత సర్వే మొదలుపెట్టారు. అయితే చాలా సర్కిళ్లలోని ఎన్యుమరేటర్లకు సర్వే ఫారాలు అందలేదు. కేటాయించిన 150 ఇళ్లను పూర్తి చేసిన వారికే సర్వే ఫారాలు ఇస్తున్నారని పలువురు ఎన్యుమరేటర్లు తెలిపారు. మరోవైపు స్టిక్కర్లు అతికించే క్రమంలో కొన్ని ప్రాంతాల్లో నగర ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని, దుర్భాషలాడుతూ సర్వేకు సహకరించడం లేదని పలువురు ఎన్యుమరేటర్లు వాపోయారు.

ఎన్యూమరేటర్లకు తప్పని ఇబ్బందులు

ప్రజలందరూ పూర్తి వివరాలను తమ సిబ్బందికి అందజేయాలని మంత్రులు నెత్తీనోరూ బాదుకుంటున్నా.. జనం మాత్రం లైట్ తీసుకుంటున్నారు. " నిన్న ఒకరి ఇంటికి వెళితే వారు ఈ సర్వే మాలాంటి వారికి కాదు. మేము రిచ్ పీపుల్. ఈ సర్వే మీలాంటి వారిదని చెప్పి పంపించేశారు. ముఖం మీదనే గేటు వేశారు. స్టిక్కర్ అతికిస్తామంటే చెప్పుల స్టాండ్ దగ్గర పెట్టి వెళ్లమన్నారు. కొంతమంది తిట్టేవారు. మేము సర్వే కోసం వెళితే నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఐడీ కార్డును లాగేసుకొని, మీరు ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించేవారు. మీకు మేము ఎలాంటి సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదని అంటున్నారు." అని ఎన్యుమరేటర్లు ఇబ్బందులు ఏకరు పెడుతున్నారు.

ససేమిరా..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కులగణన సర్వేకి రాష్ట్ర ప్రజలు సహకరించడంలేదని తెలుస్తోంది. ఈ సర్వేలో భాగంగా పేర్లు, కులం, ఆర్థికపర వివరాలు సహా ఇంకేమైనా వివరాలు చెబితే ఏ పథకాలకు కొతపెడతారోనని సందేహాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. రేవంత్ సర్కార్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కులగణన సర్వేకి రాష్ట్ర ప్రజలు సహకరించడం లేదు. ఈ సర్వేలో భాగంగా వారి వివరాలు ఇచ్చేందుకు ప్రజలు వెనక్కి జంకుతున్నట్లు సమాచారం. పేర్లు, కులం, ఆర్థికపర వివరాలు సహా ఇంకేమైనా వివరాలు చెబితే ఏ పథకాలకు కొతపెడతారో.. రేషన్ కార్డు ఏమైనా రద్దు చేస్తారోనని సందేహాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రజల నుంచి సరైన సమాధానాలు రాకపోవడంతో సర్వేలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఎన్యుమరేటర్లు వాపోతున్నారు.

> **ఉల్టా క్వశ్చన్స్..**
> వివరాలు తెలుపగపోగా.. ఎదురుప్రశ్నలు కూడా వేస్తున్నట్లు సమాచారం. రుణాలు తాము చెల్లించకుంటే ప్రభుత్వం చెల్లిస్తుందా?.. ఆస్తుల వివరాలు మీకెందుకు చెప్పాలి? అని ప్రజలు ఎన్యుమరేటర్లను నిలదీస్తున్నట్లు తెలుస్తోంది. ఇక జిల్లాల వారీగా చూసుకుంటే.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో చాలా మంది తమ ఆదాయ వివరాలు సరిగ్గా చెప్పలేదు.

19వ కాలమ్ ప్రశ్నలతో ఆందోళన..

ముఖ్యంగా సర్వే ప్రశ్నావళిలో 19వ కాలమ్ నుంచి వస్తున్న పలు ప్రశ్నలు వారిలో ఆందోళన కలిగిస్తున్నాయి. వ్యాపారం టర్నోవర్, ఆదాయ పన్ను చెల్లింపులు, వార్షికాదాయం, బ్యాంక్ అకౌంట్ సమాచారం, భూములు, ధరణి పాసు బుక్ వివరాలు, సహా ఇతర వివరాల సమాచారాన్ని వెల్లడించేందుకు చాలా మంది వెనక్కి జంకుతున్నట్లు తెలుస్తోంది.

ఆర్థిక పరిస్థితుల ప్రశ్నలపై విముఖత

ఇది మాత్రమే కాకుండా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన వివరాలు, రిజర్వేషన్ ఫలాలు అడిగినపుడు.. ఆ వివరాలతో మీకేం పని అంటూ ఎదురు ప్రశ్నలు వేస్తున్నట్లు సమాచారం. ఇది కాకుండా సర్వే ప్రశ్నావళి పార్ట్ 2లో ఫ్యామిలీ ఆర్థిక పరిస్థితులపై ప్రశ్నలు అడిగినపుడు కూడా ప్రజలు తీవ్ర విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. పశు సంపద, వాహనాలు, రేషన్ కార్డు, స్థిరాస్తి, ఇంటికి సంబంధించిన వివరాలు, బ్యాంకు రుణాలు, అప్పులు, ఆస్తులకు సంబంధించిన వివరాలు అడిగినపుడు సమాచారం చెప్పడం లేదని తెలుస్తోంది.

ధరణి వివరాలు మీకెందుకు..?

ధరణి వివరాలు అడిగినా మీకెందుకు అనే ఎదురు ప్రశ్నలు ఎన్యూమరేటర్లకు ఎదురయ్యాయి. అలాగే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏజెన్సీ ఏరియాలో కులాంతర, మతాంతర వివాహాలు చేసుకుంటే ఆ వివరాలు చెప్పలేదని తెలుస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆధార్ నెంబర్, బ్యాంక్ పాస్ బుక్ వివరాలు ఇచ్చేందుకు ముందుకు రాలేదు. ఇక ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ప్రజలు కూడా తమ ఆస్తి, భూముల వివరాలు చెప్పడానికి వెనుకంజ వేశారు. ఇక మరి కొందరేమో రైతు భరోసా రానప్పుడు భూమి వివరాలు ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

బహిష్కరణ

సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యూమరేటర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన సర్వేలో భాగంగా ఇంటింటికి వెళ్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయు లకు చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. ఎన్యూమరేటర్లను ఇండ్లలోకి రాకుండా పలువురు దుర్భాష లాడుతున్నారు. ఐడీ కార్డులు లాక్కొని ఫొటోలు తీసుకుంటున్నారని వాపోతున్నారు. పలు ప్రాంతాల్లో సెక్యూరిటీ సిబ్బంది లోపలికి అనుమతించడం లేదంటున్నారు. తాజాగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వెంకట్రావుపల్లె గ్రామస్తులు ఇంటింటి కుటుంబ సర్వేను బహిష్కరించారు. ఇటీవల ఈ గ్రామ సరిహద్దులు మార్చుతూ గెజిట్ వచ్చింది. అయితే గ్రామస్తులు దానిని వ్యతిరేకిస్తూ నెల క్రితం ఎంపీడీవో, తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇచ్చారు. అయినా స్పందన రాకపోవడంతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు దూరంగా ఉన్నారు. ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి గ్రామస్తులతో మాట్లాడారు. కానీ సరిహద్దును రీసర్వే చేశాకే సర్వేకు సహకరిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు.

హనీట్రాప్‌తో కిడ్నాప్

జనపదం, లక్నో: మహిళలతో కూడా మురా ఒక వ్యక్తిని హనీట్రాప్ చేశారు.. డేటింగ్ కోసం పిలిచి కిడ్నాప్ చేశారు. అతడి కుటుంబం నుంచి డబ్బులు డిమాండ్ చేశారు. బాధితుడి కుమారుడి ఫిర్యాదుతో పోలీసులు అతడిని కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరప్రదేశ్‌లోని లలిత్‌పూర్‌కు చెందిన 50 ఏళ్ల లల్లూ చౌబేకు ఒక మహిళ ఫోన్ చేసింది. డేటింగ్ పేరుతో అతడ్ని ఝాన్సీకి గురువారం రప్పించింది. కొందరు వ్యక్తులు చౌబేను కిడ్నాప్ చేసి ఒక చోట బంధించారు. అతడి కుటుంబానికి ఫోన్ చేశారు. చౌబేను విడిచిపెట్టేందుకు మూడు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లక్ష ఇచ్చినప్పటికీ అతడ్ని విడిచిపెట్టలేదు. దీంతో చౌబే కుమారుడు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో ఒక కానిస్టేబుల్ చౌబే కుమారుడిగా నటించాడు. డిమాండ్ చేసిన డబ్బు ఇచ్చేందుకు వారిని కలిశాడు. లల్లూ చౌబేను నిర్బంధించిన చోటుకు ఆ కానిస్టేబుల్‌ను ఒక వ్యక్తి తీసుకెళ్లగా వారిని అనుసరించిన పోలీస్ బృందాలు అక్కడకు చేరుకుని కిడ్నాప్ అయిన లల్లూ చౌబేను కాపాడారు. ముగ్గురు నిందితులైన 35 ఏళ్ల కిరణ్, 30 ఏళ్ల అఖిలేష్ అహిర్వార్, 27 ఏళ్ల సతీష్ సింగ్ బుందేలాను పోలీసులు అరెస్ట్ చేశారు. హనీట్రాప్ ముఠాలో పలువురు మహిళలు కూడా ఉన్నారని పోలీస్ అధికారి తెలిపారు.

తప్పదు మరి..?!

(మొదటిపేజీ తరువాయి) ఎన్నికల సందర్భంలో తెలంగాణలో ఆరు గ్యారంటీలతో ప్రజల్లోకి వెళ్లింది. గెలిపిస్తే తాము చేసే ఉచితాలను పకడ్బందీగా ప్రచారం చేసుకుంది. దానికి బీఆర్ఎస్ పై ఉన్న ప్రజాగ్రహం మరో బలమైంది అనేది అప్రస్తుతమిక్కగానీ, ఆరు గ్యారంటీలు మాత్రం బాగానే వర్కౌట్ అయ్యింది. సీన్ కట్ చేస్తే పగ్గాలు చేజిక్కించుకున్న విషయం తెలిసిందే. అందుకు ముందు కర్ణాటకలో కూడా ఐదు గ్యారంటీలతో యాత్రను విజయతీరాలకు చేర్చింది. దీంతో మొన్నటి హర్యానా ఎన్నికల్లో కూడా ఏడు గ్యారంటీలతో ప్రజల్లోకి వెళ్లినా ఫలితం తారుమారైంది. అనుకున్నది దక్కలేదు. తాజాగా మహారాష్ట్ర ఎన్నికల్లో ఎనిమిది గ్యారంటీలతో ఎలాగైనా పాగా వేయాలనే పథకంలో హస్తం తీవ్ర కసరత్తు చేస్తున్నది. ఇలా గ్యారంటీలు పెరుగుతున్నాయి.., వాటి ఆచరణలు మాత్రం గందరగోళంగా మారుతున్నాయి.

పాగా వేయడానికి కమలం..

కాంగ్రెస్ గ్యారంటీలను తిట్టిపోసిన కమలం కూడా ఇప్పుడు వాటినే ఆశ్రయించాల్సిన దుస్థితికి జారుకున్నది. అసలు ఉచితాలు అవసరం లేదు., ప్రజలకు హస్తం గ్యారంటీలు తప్పుడు సంకేతాలు ఇస్తోందని దుమ్మెత్తిపోసిన ఆ పార్టీ నేతలు మహారాష్ట్రలో తప్పనిసరై అన్నట్టుగా ఏకంగా పది గ్యారంటీలతో ప్రచారంలోకి దిగుతున్నారు. దక్షిణాదిలో మహారాష్ట్రను కొడితే ఇక పట్టు సాధించడం అంత పెద్ద సమస్య ఏమీ కాకపోదు అనే ఆలోచనతో ఉన్న బీజేపీ అగ్రనాయకత్వం గ్యారంటీలను ఆశ్రయించాల్సిందే అనే దారిలోకి వెళ్లిపోయారు. ఈ క్రమంలోనే కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేతుల మీదుగా విడుదల చేసిన మేనిఫెస్టోలో పది గ్యారంటీలతో ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించారు.

జాతీయ పార్టీలు ఇప్పుడు స్థానికంగా పాగా వేయడానికి దిగజారి ప్రవర్తిస్తున్న చాయలు సుస్పష్టం. ప్రాంతీయ పార్టీలను నిలువరించాల్సిన సందర్భాన్ని పురస్కరించుకుని హామీల విషయంలో ఒకదానికి మించి మరోటి గుప్పిస్తూ నిజస్వరూపాన్ని బయటపెట్టుకుంటున్నాయి. కాంగ్రెస్, బీజేపీ., ఇలా పార్టీ ఏదైతేనేం తన మార్గం అధికార పీఠం., అనుసరించేది దొడ్డి దారి అన్నట్టుగా గ్యారంటీలతో పబ్బం గడుపుకోవడానికి వెనకాడడం లేదు. మున్ముందు గ్యారంటీల తీవ్రత మరింత పెరిగి ప్రజాస్వామ్య అసలు స్వరూపంపై దుష్ప్రభావం పడే రోజులు కూడా లేకపోలేదని మేధావులు పేర్కొంటున్నారు.

మహారాష్ట్రలో బీజేపీ మేనిఫెస్టో విడుదల..

- సంకల్ప పత్ర పేరిట మేనిఫెస్టో విడుదల చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా..
- రైతులు, మహిళలు యువతకు బీజేపీ హామీలు..
- బీజేపీ మేనిఫెస్టోలో పది గ్యారంటీలు..
- రైతు రుణమాఫీ, యువతకు 25 లక్షల ఉద్యోగాలు
- మహారాష్ట్ర బీజేపీ మేనిఫెస్టో విడుదల

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు మరో 10 రోజుల సమయం మాత్రమే ఉన్నది. ఈ నేపథ్యంలో బీజేపీ తన మేనిఫెస్టోను విడుదల చేసింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా 'సంకల్ప్ పత్ర' పేరుతో దీనిని విడుదల చేసి మాట్లాడారు. అ మేనిఫెస్టో రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందని అన్నారు. యువకులు, పేదలు, రైతులు, మహిళల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు రూపొందించామని చెప్పారు. నైపుణ్య గణన, స్టార్టప్‌ల అభివృద్ధి కోసం శివాజీ మహారాజ్ కేంద్రం, ఇంక్యుబేషన్ సెంటర్లు, వడ్డీ లేని రుణాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష మహా వికాస్ అఘాడిపై అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రతిపక్ష కూటమి వాగ్దానాలను విస్మరించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎన్ని ఎత్తులు వేసినప్పటికీ దేశంలో మత ఆధారిత రిజర్వేషన్లను బీజేపీ అనుమతించదని పునరుద్ఘాటించారు. మహారాష్ట్రలో సుస్థిరమైన, విశ్వసనీయమైన పరిపాలన ఉండాలంటే మహాయుతి ప్రభుత్వం అధికారంలో కొనసాగాలని వ్యాఖ్యానించారు. అన్ని కులాలు, వర్గాలకు సమాన ప్రాధాన్యత ఇచ్చామని ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. రాష్ట్రాన్ని వికసిత్ మహారాష్ట్రగా మార్చేందుకు రోడ్ మ్యాప్‌ను రూపొందించామన్నారు.

> **కీలక అంశాలివే..**
> - యువతకు 25 లక్షల ఉద్యోగాలు
> - ప్రస్తుతం 11 లక్షల మంది మహిళలకు ప్రయోజనం చేకూరుస్తున్న 'లఖపతి దీదీ' పథకాన్ని 50 లక్షల మంది మహిళలకు విస్తరించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం
> - పారిశ్రామిక అభివృద్ధిని పెంచేందుకు ప్రభుత్వం నుంచి రూ.25 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు
> - రైతులకు రుణమాఫీ చేసి, వారిపై రుణ భారాన్ని తగ్గించడానికి చర్యలు
> - వృద్ధుల పెన్షన్‌ను రూ.1,500 నుంచి రూ.2,100కు పెంచడం
> - రైతు రుణాల మాఫీ, విద్యార్థులకు నెలకు రూ. 10 వేలు..
> - మహిళలకు నెలకు రూ. 2,100, ఆశా వర్కర్లకు రూ. 15 వేలు..
> - 25 వేల మహిళా పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు..
> - కరెంటు చార్జీల్లో 30 శాతం రాయితీ..
> - 45 వేల గ్రామాలకు రోడ్ కనెక్టివిటీ

Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act)
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com